# చిలుకా గోరువంక

**యూ**నివర్సిటి రిజస్ట్రార్ ఆఫీసు మెట్లదగ్గరకు వచ్చేవరకు మోహనరావుకి తెలియలేదు, తనా వేళ బస్సుమీద కాకుండా నడచి వచ్చాడని. కాకపోతే యింకా పెళ్లయి సంవత్సరం అయినా కాలేదు అప్పుడే అలక ప్రారంభమా! అలకకి పెద్ద కారణమేమిటి అంటే, సినిమాకి తీసికొని వెళ్లలేదట! పూర్తిగా రమదే తప్పని తనుమాత్రం ఎలా అనుకోగలడు? ఎదుటింటి కంట్రాక్టరు భార్య వచ్చిన సినిమాకల్లా వెళ్తున్నపుడు తనెందుకు వెళ్లకూడదు? అ ప్రక్క సందులోనుంచి నలభయ్యి, నలభయ్యయిదేళ్ల వయసున్న డాక్టరు ఆ వయసులో తన భార్యతో సాయంకాలము షికారుకి వెళ్తున్నప్పుడు యివ్వనంలోవున్న తామెందుకు సాయంకాలం షికారుకి వెళ్ళకూడదు? అంచేతే రమ యీవేళ అలిగింది. ఆడవాళ్ళకి సహజమైన ఆకోరిక మరోకవిధాన నెరవేరదని ఆమెకి తెలుసు. మోహన్ యింతకు ముందు చెప్పాడు కూడా, తనది ఎగ్జామినేషన్ సెక్షనని, అంచేత సాధారణంగా తీరుబడి వుండదని. అంతగా వెళ్ళాలనుకుంటే రెండవ ఆటకు వెళ్దామన్నాడు. కాని రమ అందుకంగీకరించలేదు. ఇద్దరూ సాయం సమయంలో ఒకరి ప్రక్క ఒకరు నడుస్తూ సినిమాకి వెళ్లాలని ఆమె కోరిక. బయటకి చెప్పేకారణం మాత్రం, రెండవ ఆటయితే నిద్రచాలదు.

ఇవన్నీ తెలుసు మోహన్‌కి. కాని ఏం చేయగలడు? 'నా భార్య నేను సినిమాకి వెళ్ళాల'ని చెప్పి వేగం ఆఫీసు విడిచిపెట్టి రాగలడా. ఏ వంక పెట్టుకుని తను వేగం యింటికి వెళ్ళగలడు? -తన ఉద్యోగం యింకా స్థిరం కాలేదాయె. తా నెంత స్వేచ్ఛగా బ్రతుకుదామనుకున్నా సంఘ నియమాలకి కట్టుబడి వుండవలసిందే. స్వేచ్ఛగా గాలిలో ఎగిరే చిత్తుకాకితాలకి, ఫైల్సులో కట్టివుండే కాగితాలకున్నంత గౌరవముండదా.

అతని ఆలోచనలకి యూనివర్సిటీకి వెళ్లే మార్గంలోవుండే ప్రశాంత వాతావరణం అంతరాయంకలిగించలేదు. అంచేతే ఆఫీసు మెట్లదగ్గరకు వచ్చేవరకు తానావేళ బస్సుమీద కాకుండా నడచి వచ్చినట్టు గుర్తు రాలేదు. ఆలస్యమయిందేమో అని వేగంగా అడుగులు వేశాడు.

తన సీటులో ఎవరో కూర్చునివున్నారు. కొంపదీసి ఉద్యోగం ఊడబీకెయ్యలేదు కదా. అయినా ముందుగా తెలియజెయ్యకుండా ఎలా తీసేస్తారు? ఆశ్చర్యంతోను, భయంతోను సీటుదగ్గరికి వెళ్ళాడు. సీటులో కూర్చున్న ఆయన రండి రండంటూ ప్రక్క కుర్చీలో కూర్చున్నాడు. ఉద్యోగం తీసేశారని చావుకబురు చల్లగా చెప్పడుకదా! అలా చెప్పలేదు పాపం. ఈ వేసవులలో మోహన్ సీటుదగ్గర పని హెచ్చుగా వుంటుందని ఆయన్ని వేశారట.

మోహన్ సంతోషం పట్టలేకపోయాడు. అయితే సాయంత్రం వేగం యింటికివెళ్ళి రమని సినిమాకి తీసికొని వెళ్ళవచ్చన్నమాట. క్రొత్తగ తన సీటుదగ్గరికి వచ్చిన సత్యనారాయణ సహాయంతో వేగం పనులు

## 'కీర్తిప్రియ'

పూర్తిచేసుకున్నాడు. ఆవేళ ఒంటిగంటకు కాఫీ త్రాగడం కూడా మానేసి అయిదు గంటలవరకూ పని చూసుకున్నాడు. ఐదు అవగానే ఫైల్సు కట్టేసి లేచి నిలబడ్డాడు. ఈ మధ్య వారం పదిరోజులకి అయిదయ్యేటప్పటికి పని పూర్తవడం యీవేళే. మోహన్ సంతోషిస్తున్నాడు. కిటికీలో నుండి వచ్చేగాలికి ఫైలులో కాగితాలు రెపరెపలాడుతున్నాయి. నిర్బంధంలో కూడ స్వేచ్ఛ వుందేమో.

బస్సు బయలుదేరడానికి యింకొక పావుగంట టయిముంది. మనోవేగంలో పరుగు పెట్టలేని బస్సులో ప్రయాణం చెయ్యడానికి ఆవేళ మోహన్‌కి మనస్కరించలేదు. ఇంటివైపు నడక సాగించాడు. వేగం యింటికి వెళ్లినా యీవేళమాత్రం సినిమాకి వెళ్లకూడదు. సినిమాకి వెళ్తే రమదగ్గర తన పరాజయాన్ని ఒప్పుకున్నట్టుకదూ. ఇక మీదట ఏ కోరిక కోరినా తీర్చకపోతే యిలా చెయ్యదు. ఉదయం తను అలిగినందుకే నేను యీవేళ వేగం యింటికి వచ్చానుకుంటుంది గాని, యీవేళ ఆఫీసుపని వేగం అయిపోవడంవల్ల రాగలిగాననుకుంటుందా. పెళ్ళయిన కొత్తలోనే ఆమెకి దాసోహం అంటున్నట్టు కనపడితే, యికముందు చాలా చిక్కులు రావచ్చు.

ఏమయినా సరే యీవేళ సినిమాకి మాత్రం వెళ్ళకూడదు – అనుకున్నాడు మోహన్.

సినిమాకి రమతోపాటు వెళ్లకూడదనే గట్టి నిశ్చయంతో, ఉదయం జరిగిన గందరగోళాన్ని మననం చేసుకుంటూ, సాయంత్రానికి జరుగబోయే ప్రమాదాన్ని వూహించుకుంటూ యింట్లో అడుగు పెట్టాడు మోహన్. ఎండలో నడిచివచ్చిన అతని ముఖం వరండాలో కూర్చున్న మామగారిని చూసేసరికి అదోలా మారింది. లేని చిరునవ్వు తెచ్చుకున్నాడు. కొంపదీసి యీవిడగారు నాన్నగారితో యిలా అని చెప్పలేదుకదా. ఈయన ఆ మాటలమీద రమని యింటికిగాని తీసికొని వెళ్తాననడుగదా. తీసికొని వెళ్తే వెళ్ళనీ, రోజూ గొడవలు పడేబదులు ఏ హోటలు భోజనమో చెయ్యవచ్చు అనుకున్నాడు.

ఈ పెద్దమనిషికి తీరుబడి లేదట. ఇప్పుడెలాగయిందో తీరుబడి. అయిదున్నరయ్యేటప్పటికల్లా వచ్చేరు. నాన్నగారు రాబట్టిగాని లేకపోతే యీవేళ కుండలు డింకీలు కొట్టేవే. కాకపోతే తను ఏం కోరికలు



శ్రీమతి మల్లాది వసుంధరాదేవి

ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి చరిత్రాత్మక నవలా రచన పోటీలో ఈమె రచించిన "తంజావూరు పతనము" అను గ్రంథమునకు వెయ్యి రూప్యముల ప్రథమ బహుమతి వచ్చినది. ఈమె వయస్సు 19 సం॥లు.

కోరిందని? కంట్రాక్టరుగారి భార్యలా మామిడి పిందెల నెక్లెస్ కొనమందా? డాక్టరుగారి భార్యలా చేతికి రిస్టువాచి కొనమందా. ఒకనాడు సినిమాకి తీసికొని వెళితే చాలునంది. రెండవ ఆటకు రావాలట. ఆ తొమ్మిది గంటల రాత్రపుడు యీసురోమంటూ వెళ్లి అర్ధరాత్రపుడు తాగినవాళ్లలా తూలుతూవచ్చినట్టై వుంటుందా, సాయంకాలం యిద్దరు ముచ్చట తీరా వెళ్తుంటే. పట్నం వాసి తన భర్త కాబోతున్నాడని తెలిసినపుడు తను ఎలాంటి కలలు కన్నదీ! ఆయనకి నిజంగాతీరుబడివుండడం లేదేమో? లేకపోతే ఆకాగితాలు యింటికికూడఎందుకు తెస్తారు. అయినా తీరుబడి చేసుకో దలచుకుంటే ఎందుకు చేసుకోలేరు – అనుకుంది రమ. ఆ పూట వంటమానేద్దామనుకున్నా, తండ్రి రావటంవల్ల వంటచెయ్యడం తప్పనిసరయింది.

అనుభవశాలి ముగ్గురు ఆడపిల్లలు తండ్రి అయిన మధుసూదనం వీళ్ల ప్రవర్తన యిట్టే గ్రహించాడు. ఏదో చిన్న విషయం మీద మూతులు ముడుచుకునుంటారు. ఈ వేళకి ఒక సినీమాకి ప్రయాణం చేయిస్తే వాళ్ళే సర్దుకుపోతారు – అనుకున్నాడు.

“ఇవాళ మొదటిఆటకు అలా ‘పూర్ణా’ వైపు రండోయ్. నేను డాబా తోటలో స్నేహితుడు యింటికి వెళ్ళి టైముకు అక్కడికి వస్తాను. మరి లేవండి. నేను యింక అలా వెళ్ళి వస్తాను. రమా! వేగం తయారు కావమ్మా. ఆడవాళ్ల ప్రయాణం అవడానికి చాలా ఆలస్యమవుతుంది.” అంటూనే వీధిలోకి అడుగుపెట్టాడు మధుసూదనం. మంచీ చెడ్డా మాట్లాడకుండానే వెళ్లిపోతున్న మామగారివైపు అలా చూస్తూ నిల్చుండిపోయాడు మోహన్.

ఇక తప్పని సరి అనుకుంటూనే యిద్దరూ సినిమాకి తొందరగా తయారయ్యారు. ఆరు అయేటప్పటికల్లా వీధిలో అడుగుపెట్టారు.

మామయ్య సినిమాకి ఎందుకు రమ్మన్నాడు? సినిమాకి తీసికొని వెళ్ళలేదని రమ చెప్పిందా? మా యిద్దరి ప్రవర్తన చూసి ఏదో చిలిపి కయ్యం పెట్టుకునుంటారని గాని రమ్మన్నాడా? ఈవేళ సినిమాకి వెళ్లకూడదనుకున్నాడు గాని తప్పనిసరయింది. జవాబయినా చెప్పనీయకుండా వెళ్ళిపోయాడు మామయ్య. రమకు సంతోషమే – తననుకున్నది నెరవేరినందుకు...ఆ సైకిలు రిక్షాలో వచ్చే భార్యాభర్త లెందుకలా చూస్తారు? మా యిద్దరిని చూసి యీర్ష్యా? వాడెందుకు, ఫ్రెండు మాట్లాడుతున్నా మావైపు చూస్తున్నాడు గుడ్లు మిటకరించుకొని? వెధవలు వాళ్ళ మానాన వాళ్ళుండక చీమ చిటుకుమంటే సరి ఆడ దెవ్వరయినా వెళ్తుందేమోనని బుర్ర తిప్పుతారు.

చివరికి నా పంతమే నెగ్గింది. ఆయన కూడ యీ వేళ సినిమాకి బయలుదేరే ఉద్దేశంతోనే వేగం వచ్చారు. కాని ఏంలాభం? ఇద్దరం మాట్లాడుకుంటూ సర్దాగా వెళ్తుంటే ఎంత బాగుండేది! ఆయన మరీను. రోడ్డుమీద అడుగు పెట్టేకయినా మాట్లాడకూడదా? నేనేం తప్పు చేశాను? పెద్ద కోరికలు కోరలేదు కదా, కోపం రావడానికి? సినిమాకి యిద్దరం కలిసి వెళ్దామన్నాను, అంతేగా.

అలా అనుకుంటూనే ఒకరితో ఒకరు మాట్లాడకుండా కొంత ఎడంగా నడుస్తున్నారు రమ మోహన్లు. కొద్దిదూరంలోవున్న యింటి కిటికీగుండా తమవైపుచూస్తున్న నలభయ్యేండ్ల ముత్తయిదువను చూశాడు మోహన్. అలా చూస్తుండగానే ఆమె ప్రక్కకి పద్దెనిమిది యిరవయ్యేండ్ల ప్రాయపు స్త్రీ వచ్చి చేరింది. ఆ యిల్లు దాటుతుండగా “చూశావా! చిలుక గోరువంకల్లా ఎలా వెళ్తున్నారో!” అన్న మాటలు అస్పష్టంగా వినబడ్డాయి ఆ యిద్దరికి. అప్రయత్నంగా చిరునవ్వు వారి ముఖాలమీద ప్రత్యక్షమయింది. ఒకరివైపు ఒకరు చూచుకొని రమా మోహనులు కొంత దగ్గరగా వచ్చి ఆ రోడ్డుమలుపు తిరిగారు. పైపై ప్రవర్తన చూసి భ్రమసిపోయే మానవజాతిని చూసి మందహాసం చేసింది – ఎదుటనున్న ఏరాడ కొండ. ★





“మీ డబ్బుకు పూర్తి విలువ”
క్రొత్త నేషనల్-ఎకో రేడియో
మోడల్ A-346

మోడల్ A-346: AC మెయిన్లకు
మోడల్ U-346: AC లేక DC మెయిన్లకు

4 మల్టీ-పర్పస్ రిమ్‌లాక్ వాల్వులు; 5 వేవ్ బ్యాండ్లు; అదనపు స్పీకరును మరియు గ్రామఫోనును కలుపుటకు వసతి; ఎత్తు తక్కువ పీఠముతో ఆకర్షణీయమగు కొయ్య క్యాబినెట్. పూర్తిగా “మాన్సునై జేద్”.

గమనిక: అనుమతిపొందిన డీలరు వద్ద కొనబడిన నేషనల్-ఎకో రేడియోలకు మాత్రమే ఫ్యాక్టరీ గ్యారంటీ యున్నది. డీలర్ల వద్ద నేషనల్-ఎకోవారి అనుమతి పత్రమును చూడగోరుడు.

నేషనల్-ఎకో

ఫ్యాక్టరీ ప్రతినిధులు:
జనరల్ రేడియో & అప్లయన్సెస్ లిమిటెడ్
1/18, మౌంట్ రోడ్డు, మద్రాసు.
36/79, సిల్వర్ జూబిలి పార్క్‌రోడ్డు, బెంగుళూరు.
బొంబాయి — కలకత్తా — ఢిల్లీ

GRA 8169